

మహబూబ్‌నగర్‌లోని క్లాక్‌టవర్ చౌరస్తాలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌కు హాజరైన ప్రజలు



ర్యాలీలో అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి; చిత్రంలో ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లా ఎమ్మెల్యేలు



ప్రసంగిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

మీ బిడ్డగా అడుగుతున్నా..!

- పాలమూరులో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థులను గెలిపించండి..
- జిల్లాపై బాధ, దుఃఖం నాకంటే ఎక్కువ ఎవరికీ ఉండదు
- దేశంలోనే ఆదర్శంగా జిల్లాను అభివృద్ధి చేసే బాధ్యత నాది
- వంద రోజుల్లోనే పాలమూరుకు రూ.10 వేల కోట్ల నిధులు
- అరుణమ్మ గెలిస్తే వారి గడీల్లో బంధువులకే మేలవుతుంది
- వంశీచంద్‌రెడ్డి నామినేషన్ కార్నర్ మీటింగ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 'ఇన్నేళ్లు ఎవరెవరికో ఓట్లు వేశారు.. ఎవడెవడో రాజ్యమేలిండు.. ఎవని దగ్గరికో పోయి అయ్యా దేహీ అని అడుక్కునే పరిస్థితి పాలమూరుకు తెచ్చిన్రు.. ఇవాల నేను అడుగుతున్నా.. మీ బిడ్డగా అడుగుతున్నా.. ఇక్కడే పుట్టిన, ఇక్కడే పెరిగిన.. రేపు పోయినా ఈ మట్టిలో కలిసే మీ బిడ్డగా.. నల్లమల అడవుల బిడ్డగా.. నల్లమల నుంచి వచ్చిన నేను.. ఈ నేల, ఈ గాలి, ఈ నీరు నాది, మనది.. మనందరిది.. నాకున్న బాధ, నాకున్న దుఃఖం ఎవరికన్నా ఉంటదా.. ఈ జిల్లా పట్ల ఒక్కసారి ఆలోచన చేయండి.. ఎన్నడైనా.. ఎంత ఎత్తుకు ఎదిగినా.. ఢిల్లీకి రాజైనా తల్లికి బిడ్డ అన్నట్లే.. ఈ పాలమూరు బిడ్డను.. ఈ జిల్లాను అభివృద్ధి చేసే బాధ్యత నాది.. నా తరపున.. మీ తరపున ఢిల్లీలో నేను చెప్పిన పనులు చక్కదిద్దడానికి నాకు సొంత మనుషులు కావాలి కదా.. మనవాళ్లు కావాలి కదా మట్టికి పోయినా ఇంటోడే పోవాలని పెద్దలు చెప్పారు.. మరి ఇంత పెద్ద సమస్యలను పరిష్కరించాలంటే మన ప్రభుత్వం చెప్పినట్లు పనిచేసే వారు కావాలా, వద్దా ఆలోచించాలి, ఈ ప్రభుత్వం మనది.. ఇంకా నాలుగున్నరేళ్లు ఉంటం.. పింఛన్లు కావాలన్నా, ఇందిరమ్మ ఇళ్లు, ఉద్యోగాలు, పెట్టుబడులు తేవాలన్నా, ఈ ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్నప్పుడే జిల్లాలో రెండు పార్లమెంట్, తెలంగాణలో 14 సీట్లు గెలిపించినప్పుడే ప్రయోజనం ఉంటుంది.. అధికారం మన చేతుల్లో ఉంది.. ప్రభుత్వం మన దగ్గర ఉంది.. మన శత్రువు చేతుల్లో కత్తి పెడతే.. వారు పక్కోన్ని పొడవడు.. మనల్నే పొడుస్తరు..' అని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి నామినేషన్ ర్యాలీకి హాజరైన ఆయన క్లాక్ టవర్ వద్ద నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ప్రసంగించారు. 60 ఏళ్ల ఉమ్మడి పాలకులు చెరబట్టి.. పడావు పెట్టిన పాలమూరు- రంగారెడ్డి, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులు పదేళ్లలో పూర్తి చేశావా? ఏదైనా పరిశ్రమలు పాలమూరుకు తీసుకువచ్చావా? అని నిలదీశారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు పేద బిడ్డల చదువు కోసం పాలమూరు యూనివర్సిటీ మంజూరు చేస్తే 150 కొలువులు ఉన్న పీయూలో 130 ఖాళీలను పదేళ్లుగా భర్తీ చేయలేదని విమర్శించారు. ఏం చేయకుండానే పళ్లు ఇకిలించుకుంటూ వచ్చి ఓట్లేయండి.. పార్లమెంట్‌లో పోయి గుర్రు పెట్టి నిద్ర పోతామని అంటున్నారని ఎద్దేవా చేశారు. శ్రీనివాస్ రెడ్డి మంచోడేనని, గతంలో కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీని చేసిందని గుర్తు చేశారు. కేసీఆర్‌ను ఎంపీని చేస్తే ఐదేళ్ల పార్లమెంట్‌లో పల్లెతు మాట్లాడిండా, పీఆర్‌ఎల్‌ఐపై ప్రస్తావన చేసిండా అని ప్రశ్నించారు. మనిషి మంచోడే కానీ మంచానికి పడ్డాడని, లేవడానికి చేతకాదని, లేచినా మాట్లాడే అధికారం లేదని విమర్శించారు. ఐదేళ్లలో ఆఆలు నేర్చుకోని ఆయనను మరోసారి ఎంపీ అభ్యర్థిగా ఓటు వేస్తే ఏమన్నా లాభమా...? ఓటర్లు ఆలోచన చేయాలని సూచించారు. 60 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న బీసీ కులాల జనాభా లెక్కింపు చేస్తున్నామని, నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకమే కాదు.. మెడికల్ కాలేజీ, ఇంజనీరింగ్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ, వెటర్నరీ కాలేజీ, డిగ్రీ కాలేజీ, మహిళా డిగ్రీ కాలేజీ, జూనియర్ కాలేజీలు, లా కాలేజీలు మన జిల్లాకు ఇచ్చి పేదలు చదువుకోవడానికి అవకాశం కల్పించామని చెప్పారు. పాలమూరులో కాంగ్రెస్‌ను ఓడగొట్టాలని గద్వాల గడీ నుంచి దొరసాని బయల్దేరిందని, గద్వాల గడీల దొరలకైనా, గజ్వేల్‌లో ఫామ్‌హౌజ్ దొరలకైనా గడీల ముందట బానిసలుగా బతకదలుచుకోలేదని అన్నారు. కాళ్ల కింద చెప్పుల్లా, నెత్తిన గొడుగులా చేతుల్లో చురకత్తులై అన్నదమ్ములనే పొడుచుకోదలుచుకోలేదని స్పష్టం చేశారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత ముదిరాజ్ బిడ్డను మంత్రిగా చేసే బాధ్యత తీసుకుంటామని చెప్పారు. మాదిగల వర్గీకరణ కోసం పార్లమెంట్, సుప్రీం కోర్టులలో కొట్లాడే బాధ్యత తమది అని అన్నారు. పదేళ్లుగా అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వంలో చేరిన అరుణమ్మ, పదేళ్ల రాష్ట్రంలో కేసీఆర్ సీఎంగా ఉన్నారని, ఈ మొనగాళ్లు పాలమూరుకు పది పైసలైనా తెచ్చారా, పీఆర్‌ఎల్‌ఐకి జాతీయ హోదా తెచ్చారా అని ప్రశ్నించారు. కానీ, అరుణమ్మ మాత్రం జాతీయ ఉపాధ్యక్షురాలి పోస్టు తెచ్చుకున్నారని విమర్శించారు. అరుణమ్మ గెలిస్తే గడీల ఉన్న వారి బంధువులకు మేలైతదని, పదవులొచ్చిన వారి కుటుంబానికి మేలైతది తప్పా పాలమూరుకు న్యాయం జరగదన్నారు. కేసీఆర్ పిట్టలదొరకు తాత అయ్యారని, తండ్రికి తద్దినం పెట్టనోడు చిన్నాన్నకు కృష్ణానదిలో పిండాలు పెడుతున్నట్లుగా ఆయన శైలి ఉన్నదన్నారు. డిసెంబర్‌లో కేడీని బొందపెట్టినట్లుగానే ఈసారి మోదీని ఓడగొట్టి పాలమూరు పౌరుషాన్ని చూపించాలని పిలుపునిచ్చారు". ఏడికి పోయినా నేను చెప్పేది నా అడ్డ, నా గడ్డ పాలమూరు బిడ్డ.. ఆనాడు తట్ట, మట్టి, పార పనికి వలసలు వచ్చినట్లు కాదు. నాయకులమై మీ రాష్ట్రానికి వచ్చాం, నాయకులమై దేశంలోనే గౌరవాన్ని పెంచామని చెబుతున్నా" అని అన్నారు. ఈ జిల్లాలో ఇద్దరు వంశీచంద్‌రెడ్డి, మల్లు రవిని చెరో లక్ష మెజారిటీకి తగ్గకుండా గెలిపించాలని, అవకాశం ఉంటే మళ్లీ వస్తానని అన్నారు. సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఢిల్లీలో రాష్ట్రప్రభుత్వ అధికార ప్రతినిధి ఏపీ జితేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, వాకిటి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

కడిగిన ముత్యం వంశీచంద్‌రెడ్డి : సంపత్‌కుమార్

చల్లా వంశీచంద్‌రెడ్డి కడిగిన ముత్యంలాంటి వాడని ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ సంపత్‌కుమార్ అన్నారు. దయచేసి ఇక్కడి ప్రజలు తప్పు చేయవద్దని, గద్వాలలో తాము అనుభవించామని, డీకే అరుణకు అవకాశం ఇస్తే సారా దందా, ఇసుక దందా, విష్కీ దందా, కిరోసిన్ దందా చేస్తారని ఆరోపించారు. ఇక్కడ ఒక పొగరు ఉన్న శ్రీనివాస్‌గౌడ్‌ను ఇంటికి పంపించామని, దేవరకద్రలో మట్టి దందా చేసే వ్యక్తిని ఇంటికి పంపామని, వారి కంటే ఎక్కువ పొగరుతో దందా చేస్తారని విమర్శించారు.

ఎడ్యుకేషన్ హబ్‌గా మహబూబ్‌నగర్: వంశీచంద్‌రెడ్డి

మహబూబ్‌నగర్ జిల్లా ఎడ్యుకేషన్ హబ్‌గా మారుతోందని మహబూబ్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి చెప్పారు. డీకే అరుణ పార్టీలు మారుతూ అవకాశ వాద రాజకీయం చేయడానికి ఓట్ల కోసం వస్తున్నారని విమర్శించారు. క్రషర్ మిషన్లు పెట్టి కొండలు మింగే వారివైపు ధర్మం ఉంటుందా, మన్యంకొండను అభివృద్ధి చేసే వారివైపు ఉంటుందా అని ప్రశ్నించారు. సారా కాంట్రాక్టర్ల వైపు ధర్మం ఉంటుందా, సాగునీటి ప్రాజెక్టులు చేపట్టే వారివైపు ఉంటుందా, మన్యంకొండ సాక్షిగా హామీ ఇస్తున్నా ఆశీర్వదిస్తే ప్రజల్లో ఒకరిగా ఉంటూ అభివృద్ధి చేస్తానని చెప్పారు.



సీఎంను గజ మాలతో సన్మానిస్తున్న నాయకులు



నాగర్‌కర్నూల్‌లో నామినేషన్ దాఖలు చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్; చిత్రంలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, జైపాల్ యాదవ్, గువ్వల బాలరాజు

రెండో రోజు ఆరుగురి నామినేషన్

- మహబూబ్‌నగర్‌లో ఐదుగురు, నాగర్‌కర్నూల్‌లో ఒకరి దాఖలు

నాగర్‌కర్నూల్/మహబూబ్‌నగర్ కలెక్టరేట్/మహబూబ్‌నగర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : లోకసభ ఎన్నికల నామినేషన్‌లలో భాగంగా రెండవ రోజైన శుక్రవారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఆరుగురు నామినేషన్లను దాఖలు చేశారు. అందులో మహబూబ్‌నగర్‌లో ఐదుగురు, నాగర్‌కర్నూలులో ఒక్కరు ఉన్నారు. మహబూబ్‌నగర్ లోకసభ నియోజకవర్గానికి ఐదుగురు నామినేషన్లు దాఖలు అయ్యాయి. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా వంశీ చందర్ రెడ్డి ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి. రవినాయక్‌కు రెండు సెట్ల నామినేషన్ పత్రాలు సమర్పించారు. బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్ రెడ్డి తరపున ప్రతిపాదకులు టీ. శ్రీధర్ రెడ్డి ఒక సెట్ నామినేషన్ పత్రాలు సమర్పించారు. స్వతంత్ర అభ్యర్థులుగా హరీందర్ రెడ్డి, ఎస్. సరోజమ్మ, ఉమాశంకర్‌లు మూడు నామినేషన్లను దాఖలు చేశారు. మొత్తంగా ఐదుగురు ఆరు సెట్లు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. నాగర్‌కర్నూలు ఎంపీ స్థానంలో శుక్రవారం బీఆర్‌ఎస్ పార్టీ తరపున ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. గురువారం బీజేపీ అభ్యర్థిగా భరత్‌ప్రసాద్, కాంగ్రెస్ అభ్యర్థిగా మల్లురవి తమ నామినేషన్లను దాఖలు చేశారు.

రాష్ట్రాన్ని పాలించే అర్హతను కోల్పోయిన కాంగ్రెస్: నిరంజన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్‌లో ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్ నామినేషన్ దాఖలు అనంతరం మీడియా పాయింట్ వద్ద మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రాన్ని పాలించే అర్హతను కాంగ్రెస్ పార్టీ కోల్పోయిందని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులకు పోటీ చేసే నైతిక అర్హత లేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ అభ్యర్థి మల్లురవి బానిస అని దుయ్యబట్టారు. ఎంపీగా ఉండి 220 రోజులు పార్లమెంట్‌కు హాజరైన రాములు ఏనాడూ ప్రజా సమస్యలపై స్పందించలేదన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సమక్షంలో ఈ నెల 24న మరో సెట్ నామినేషన్ పత్రాలను దాఖలు చేస్తానన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు నాగం శశిధర్‌రెడ్డి, రంగినేని అభిలాష్‌రావు పాల్గొన్నారు.



మన్యంకొండ ఆలయంలో పూజలు చేస్తున్న వంశీచంద్‌రెడ్డి దంపతులు

వంశీచంద్‌రెడ్డి పూజలు

మహబూబ్‌నగర్ రూరల్, ఏప్రిల్ 19: మహబూబ్‌నగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి శుక్రవారం మన్యంకొండ లక్ష్మీవేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. నామినేషన్ పత్రాలతో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఎన్నికల్లో విజయం సాధించాలని స్వామికి మొక్కి, నామినేషన్ పత్రాలను వంశీచందర్ రెడ్డికి ఆయన సతీమణి అందజేశారు. ఈ సందర్భంగా వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ స్వామి దీవెనలతోనే నామినేషన్ వేస్తున్నానని, విజయం మనదే అన్నారు. మండల కార్యకర్తలకు నామినేషన్ పత్రాలను చూపుతూ, అభివాదం చేశారు.

వృత్తిదారులకు అందని.. చేయూత

- ఉమ్మడి జిల్లాలో అమలుకాని పీఎం విశ్వకర్మ పథకం
- 18 వృత్తుల వారికి శిక్షణ ఇవ్వాలని లక్ష్యం
- ఇప్పటి వరకు వచ్చిన 8,640 దరఖాస్తులు
- 2,385 మంది ఎంపిక.. ఇంకా మొదలుకాని ట్రైనింగ్
- రుణాలకోసం లబ్ధిదారుల ఎదురుచూపు



ఇండస్ట్రియల్ ఏరియాలో వడ్రంగి పని చేస్తున్న కులవృత్తిదారులు

పాలమూరు, ఏప్రిల్ 19: చేతివృత్తుల వారికి ఆర్థిక చేయూత అందించి, అండగా నిలవాలని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం విశ్వకర్మ పథకం ఉమ్మడి పాలమూరు జిల్లాలో అమలుకు నోచుకోవడం లేదు. ఈ ఏడాది సెప్టెంబరు 17న విశ్వకర్మ జయంతి రోజున ప్రధాన మంత్రి ఈ పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకం కింద వృత్తిదారులకు శిక్షణ ఇచ్చి, అనంతరం వ్యాపారాలు చేసుకునేందుకు రుణాలు ఇవ్వాల్సి ఉంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 8,640 దరఖాస్తులు రాగా.. వారిలో 2,835 మందిని ఎంపిక చేశారు. కానీ శిక్షణ ఇంకా మొదలు కాలేదు. పథకం అమలు బాధ్యతను ఉమ్మడి జిల్లా నోడల్ అధికారులకు అప్పగించారు.

ఎవరెవరికి శిక్షణ..

ఈ పథకం కింద 18 రకాల వృత్తుల్లో శిక్షణ ఇవ్వాల్సి ఉంది. కార్పెంటర్(వడ్రంగి), పడవలు, పనిముట్లు, తాళాలు, కుండలు, దుస్తులు, చాపలు, చీపుర్లు, బొమ్మలు, ఆటవస్తువులు(సంప్రదాయ), చేపల వలలు తయారు చేసే వారికి శిక్షణ ఇవ్వాల్సి ఉంది. వారితో పాటు శిల్పులు(రాళ్లు చెక్కేవారు), వడ్డెరలు(రాళ్లు కొట్టేవారు), చర్మకారులు(చెప్పులు కుట్టేవారు), మేస్త్రీలు(భవన నిర్మాణ కార్మికులు), బ్లాక్‌స్మిత్(కమ్మరి), టూల్ కిట్, గోల్డ్ స్మిత్(కంసాలి), క్షురకులు, పూలు అల్లేవారు, రజకులు, దర్జీలు శిక్షణ పొందేందుకు అర్హులు. వీరికి ఐదు నుంచి 15 రోజుల వరకు శిక్షణ ఉంటుంది. శిక్షణ సమయంలో రోజుకు రూ.500 ఉపకార వేతనం చెల్లించాలి. శిక్షణ అనంతరం రూ.15 వేల విలువైన టూల్ కిట్ అందజేస్తారు. ఎలాంటి ష్యూరిటీ లేకుండా బ్యాంకు నుంచి రూ.లక్ష రుణం అందజేస్తారు. ఆ రుణాన్ని 18 నెలల్లో చెల్లించాలి. అలా చేస్తే మళ్లీ రూ.2లక్షల వరకు రుణ సహాయం చేస్తారు. ఆ రుణాన్ని 30 నెలల్లో చెల్లించాల్సి ఉంటుంది. ఇలా వృత్తిలో అభివృద్ధిని బట్టి రుణాలు ఇస్తారు. సకాలంలో చెల్లిస్తే మళ్లీ పెద్ద మొత్తంలో రుణాలు అందజేస్తారు.

పెండింగ్‌లో 5,805 దరఖాస్తులు

ఉమ్మడి జిల్లాలో పథకం కింద 8,640 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో మహబూబ్‌నగర్ నుంచి 2,796 మంది, నాగర్‌కర్నూల్ 1102, నారాయణపేట 266, వనపర్తి 1,919, గద్వాల నుంచి 2,557 మంది ఉన్నారు. మహబూబ్‌నగర్ నుంచి 734 మందిని, నాగర్‌కర్నూల్ 504, నారాయణపేట 119, వనపర్తి 391, గద్వాల 1,087 మంది చొప్పున మొత్తం 2,835 మందిని అప్రూవల్ చేశారు. ఇంకా 5,805 దరఖాస్తులు పరిశీలించాల్సి ఉంది. ఎంపిక చేసిన వారికి శిక్షణ ఇవ్వడంలో అధికారులు కాలయాపన చేస్తున్నారు. సరైన శిక్షకులు లేకే పథకం ముందుకు సాగడం లేదని తెలుస్తోంది.

కుటుంబంలో ఒకరికే లబ్ధి

పీఎం విశ్వకర్మ యోజన పథకం కింద రుణం పొందాలనుకుంటే 18 ఏళ్లు నిండిన వారై ఉండాలి. ఇంట్లో ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న వారుంటే ఉంటే అర్హులు కాదు. ముద్రా రుణాలు పొంది, పూర్తిగా చెల్లించాలి. ఒక కుటుంబంలో ఒకరికే లబ్ధి చేకూరుతుంది.



కుండలు తయారు చేస్తున్న వృత్తిదారుడు

బ్యాంకులు రుణాలు ఇవ్వాలి



పీఎం విశ్వకర్మ యోజన పథకంలో దరఖాస్తు చేసుకున్న వారందరికీ తక్షణమే శిక్షణ ఇచ్చి, రుణాలు అందజేయాలి. ఈ పథకం గురించి చేతివృత్తిదారులకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృతంగా ప్రచారం చేయాలి. నోడల్ అధికారి ఉమ్మడి జిల్లా అంతటా పర్యటించి, రుణాలు అందేలా చూడాలి.

- ఎం.శ్రీనివాసులు, బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కన్వీనర్

ఎన్నికల కోడ్ అడ్డుగా ఉంది



పీఎం విశ్వకర్మ పథకం అమలుకు దరఖాస్తులు వస్తున్నాయి. దరఖాస్తుదారులకు అక్‌నాలెడ్జ్‌మెంట్, గుర్తింపు కార్డులు ఇస్తున్నాం. రుణం ఇచ్చేందుకు దరఖాస్తుదారుల అర్హతలను అధికారుల బృందం పరిశీలిస్తోంది. ఎన్నికల కోడ్ ముగియగానే పథకం అమలు ఊపందుకుంటుంది.

- బాబురావు, పీఎం విశ్వకర్మ నోడల్ అధికారి

పాలవ్యాన్, బైక్ ఢీకొని.. ఒకరి మృతి

- ఇద్దరికి గాయాలు

గద్వాల, ఏప్రిల్ 19 : జోగుళాంబ గద్వాల జిల్లా పరిధిలోని అనంతాపురం గ్రామ స్టేజీ సమీపంలో శుక్రవారం పాలవ్యాన్, మోటర్‌సైకిల్ ఢీకొన్న ఘటనలో ఇబ్రాయిల్(45) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు, రూరల్ ఎస్సై పర్వతాలు తెలిపిన వివరాల ప్రకారం.. అయిజ మండలం ఎక్లాస్‌పురం గ్రామానికి చెందిన ఇబ్రాయిల్ భార్య పద్మమ్మ, కూతురుతో కలిసి బైక్‌పై ఎర్రవల్లి వైపు వెళ్తున్నారు. అదే సమయంలో కర్నూల్ నుంచి గద్వాలకు వస్తున్న పాలవ్యాన్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో ఇబ్రాయిల్ అక్కడికక్కడే మృతి చెందగా పద్మమ్మకు, కూతురికి తీవ్ర గాయాలు కాగా వారిని గద్వాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసుల పంచనామా తర్వాత మృతదేహాన్ని గద్వాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే సాయంత్రం వరకు పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

ఎండ ప్రచండం

- వనపర్తి జిల్లా చిన్నంబావిలో 45.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- ఊరట నిచ్చిన చిరు జల్లులు



వనపర్తిలో నిర్మానుష్యంగా మారిన కలెక్టరేట్‌కు వెళ్లే దారి

వనపర్తి అర్బన్/నారాయణపేట/నాగర్‌కర్నూల్ టౌన్/గద్వాల/మహబూబ్‌నగర్, ఏప్రిల్ 19 : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎండలతో అగ్నిగుండంలా మారింది. ఉదయం 10 గంటల నుంచే సూర్యుడు ప్రతాపం చూపిస్తుండటంతో ఉష్ణోగ్రతలు తారస్థాయికి చేరుకుంటున్నాయి. ఎండ తీవ్రతకు తోడు వడగాల్పులు కూడా వీస్తుండటంతో ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు.

- వనపర్తి జిల్లా చిన్నంబావిలో శుక్రవారం 45.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. పాన్‌గల్‌లో 44.0, కొత్తకోటలో 43.9, పెబ్బేరులో 43.8, గోపాల్‌పేటలో 43.7, పెద్దమందడి, ఆత్మకూరులలో 43.5, శ్రీరంగాపూర్‌లో 42.9, అమరచింత 42.6, మదనాపూర్ 42.2, వనపర్తి 42.0, వీపనగండ్ల 41.4, ఘణపూర్ 40.8, రేవల్లి 40.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.
- జోగుళాంబ గద్వాల జిల్లా ధరూర్‌లో 44.3 డిగ్రీలు, అయిజలో 44.1. వడ్డేపల్లిలో 43.8, కేటీదొడ్డిలో 43.6, రాజోలిలో 43.3, గద్వాలలో 43.1, అలంపూర్‌లో 43, ఇటిక్యాలలో 42.5, ఉండవెల్లిలో 42. మానవపాడులో 41.6, మల్దకల్‌లో 41.5, గట్టులో 40.3 డిగ్రీలు నమోదు అయ్యింది.
- నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలంలో 43.8 డిగ్రీలు, బిజినేపల్లిలో 43.5, చారకొండలో 42.7, కోడేరులో 42.5, నాగర్‌కర్నూల్‌లో 42.4, పెంట్లవెల్లిలో 42.3, పెద్దకొత్తపల్లిలో 42.0, ఉప్పునుంతలలో 41.8, లింగాలలో 40.5, పదరలో 40.0 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.
- మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకులలో 42.3 డిగ్రీలు, గండీడ్‌లో 41.9, సీసీకుంటలో 41.7, జడ్చర్లలో 41.6, మహబూబ్‌నగర్‌లో 40.9 డిగ్రీలు నమోదుకాగా, రాజాపూర్‌లో 39.4 డిగ్రీలు నమోదైంది.
- నారాయణపేట జిల్లా కోస్గి మండలంలో 38 డిగ్రీలు, మక్తల్‌లో 39, నర్వలో 40 డిగ్రీలు, కృష్ణలో 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.
- ఇదిలా ఉండగా శుక్రవారం ఉమ్మడి జిల్లాలో అక్కడక్కడ చిరు జల్లులు పడ్డాయి. వనపర్తి జిల్లా ఏదుట్ల, తాడిపత్రి, గోపాల్‌పేట, వర్షం కురిసింది. నాగర్‌కర్నూలు జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూరు, ప్రశాంత్‌నగర్, పర్హాబాద్, మల్లాపూర్‌పెంట, గుండం బేస్‌క్యాంపు, ధారవాగు బేస్ క్యాంపు తదితర ప్రాంతాల్లో శుక్రవారం మధ్యాహ్నం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఈదురు గాలులతో మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర, మండల పరిధిలోని చిన్నరాజమూర్, పెద్దరాజమూర్, నాగారం, కోయిలల్‌సాగర్ అజీలాపూర్ గ్రామాల్లోని రైతులు సాగు చేసి వరి పంట ఈదురుగాలీకా నేలకు ఒరిగింది.

ఈనెల 22 వరకు పాలీ సెట్ దరఖాస్తు గడువు

పెబ్బేరు, ఏప్రిల్ 19 : రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో డిప్లొమా ఇన్ ఇంజనీరింగ్, అగ్రికల్చర్, హార్టికల్చర్, యానిమల్ హస్బెండరీ, ఫిషరీస్ కోర్సుల్లో ప్రవేశాలు పొందేందుకు పాలీసెట్-2024 దరఖాస్తులకు ఈనెల 22 వరకు తుది గడువని పెబ్బేరు ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఏకే శ్రీకాంత్ తెలిపారు. 'పది' పరీక్షలు రాసిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

జడ్చర్లకు పల్లె వెలుగు బస్సు నడిపించాలి

● డయల్ యువర్ ఆర్ఎంలో ప్రయాణికులు

మహబూబ్‌నగర్ టౌన్, ఏప్రిల్ 19 : నాగర్‌కర్నూల్ నుంచి జడ్చర్లకు పల్లెవెలుగు బస్సును నడిపించాలని డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమంలో ప్రయాణికులు ఆర్ఎం వి.శ్రీదేవిని కోరారు. శుక్రవారం సాయంత్రం నాలుగు నుంచి ఐదు గంటల వరకు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్‌డిపోలో డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఐదు మంది ప్రయాణికులు తగు సలహాలు ఇచ్చారు. సాయంత్రం ఆరు గంటల తర్వాత నారాయణపేట నుంచి మహబూబ్‌నగర్‌కు పల్లె వెలుగు బస్సులు నడించాలని, వనపర్తి కొత్త బస్టాండ్‌లో మరుగుదొడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని, దుర్వాసన వస్తోందని ఫిర్యాదు చేశారు. అదేవిధంగా, జడ్చర్ల క్యాంటీన్‌లో అధిక ధరలకు తినుబండారాలు విక్రయిస్తున్నారని, ఫ్రీ టాయిలెట్స్ కూడా అధ్వానంగా ఉన్నాయని సరి చేయడానికి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరారు.

36 ఎకరాల గడ్డి దగ్ధం


దగ్ధమౌతున్న గడ్డి వాములు

మరికల్, ఏప్రిల్ 19 : నారాయణపేట జిల్లా మరికల్ మండలం మాధవరం గ్రామంలో 36 ఎకరాల గడ్డి దగ్ధమైంది. గ్రామస్థులు, బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో రైతు వెంకట్‌రెడ్డికి చెందిన 36 ఎకరాల గడ్డివామును వ్యవసాయ పొలంలో నిల్వ చేసి ఉంచాడు. శుక్రవారం వీచిన గాలికి గడ్డివాము సమీపాన ఉన్న విద్యుత్ తీగలు రాపిడికి గురై నిప్పురవ్వలు వాటిపై పడ్డాయి. మంటలు చెలరేగడంతో గ్రామస్థులు పేట అగ్నిమాపక కేంద్రానికి సమాచారమందించారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేయగా అప్పటికే మూడు గడ్డివాములు పూర్తిగా దగ్ధమయ్యాయి. కాలిపోయిన గడ్డి విలువ దాదాపు రూ.ఐదు లక్షల వరకు ఉంటుందని బాధిత రైతు వాపోయాడు. పశువుల ఆహారం కోసం గడ్డిని నిల్వ ఉంచినట్లు రైతు తెలిపాడు.

సిబ్బంది కొరతను పరిష్కరిస్తాం

● వైద్యవిధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్


జడ్చర్ల ఏరియా ఆసుపత్రిలో వైద్య సేవలను అడిగి తెలుసుకుంటున్న వైద్యవిధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్

మిడ్జిల్(జడ్చర్ల)/నారాయణపేట, ఏప్రిల్ 19 : ఆసుపత్రుల్లో సిబ్బంది కొరతను త్వరలోనే పరిష్కరిస్తామని వైద్యవిధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణంలోని ఏరియా ఆస్పత్రితో పాటు, నారాయణపేట జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా ఆస్పత్రుల్లో రోగులకు అందించే సేవల గురించి వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. జడ్చర్లలో 30 పడకల ఆస్పత్రి నుంచి వంద పడకల ఆస్పత్రికి మారినప్పటికీ సిబ్బందిని పెంచలేదని సూపరింటెండెంట్ డాక్టర్ సోమశేఖర్, కమిషనర్ అజయ్‌కుమార్‌కు వివరించారు. సమస్య ప్రభుత్వం దృష్టిలో ఉందని త్వరలోనే సిబ్బంది సమస్యను పరిష్కరించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎంవో హరినాథ్, డాక్టర్లు రాఘవేందర్, సూర్యబాద్షా, హర్షద్, ప్రశాంతి, స్వప్నలతో పాటు, వైద్య సిబ్బంది ఉన్నారు. అదేవిధంగా, నారాయణపేట జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన కమిషనర్ ఈనెల 17వ తేదీన మద్దూరు మండలం భీంపురం గ్రామానికి చెందిన గర్భిణీ గోవిందమ్మ పసిబిడ్డ మృతి చెందిన సంఘటనపై పూర్తి స్థాయిలో విచారించి, సిబ్బందితో వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకొని వార్డులను పరిశీలించారు. నారాయణపేట జిల్లా ఆసుపత్రితో పాటు, మద్దూరు, కోస్గి, మక్తల్ ఆసుపత్రిలో అవసరమైన వసతులు, వైద్యుల అవసరం, పరికరాల కోసం నివేదికలను ఇవ్వాలని ఆయా ఆసుపత్రి వైద్యులకు సూచించారు. పూర్తి స్థాయి నివేదికలు అందిస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, ఎన్నికల అనంతరం సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటానని చెప్పారు. కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రాంకిషన్, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ రంజిత్, ఆర్ఎంవో పావని, వైద్యులు ఉన్నారు.

అప్పర్, లోయర్ విద్యుత్ కేంద్రాల అద్దె వాహనాల టెండర్లు వాయిదా

ఆత్మకూరు, ఏప్రిల్ 19 : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు అప్పర్, లోయర్ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న అధికారుల సౌకర్యార్థం ఏర్పాటు చేయనున్న అద్దె వాహనాల టెండర్లు ఈనెల 24వ తేదీకి వాయిదా వేయనున్నట్లు ఎస్ఈ రామసుబ్బారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సరైన టెండర్లు రాకపోతే తాత్కాలికంగా వాయిదా వేయనున్నట్లు తెలిపారు.

రేపు ఫుట్‌బాల్ సీనియర్ క్రీడాకారుల ఎంపిక

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఏప్రిల్ 19 : ఫుట్‌బాల్ సీనియర్ క్రీడాకారుల ఎంపికను ఆదివారం వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలోని వీజేపీ గ్రౌండ్‌లో నిర్వహించనున్నట్లు ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు కరీంనగర్ జిల్లా గోదావరిఖనిలో పదో రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్ జరగనుందని పేర్కొన్నారు. ఈ పోటీలో పాల్గొనడానికి సీనియర్ క్రీడాకారులను ఆదివారం ఎంపిక చేయనున్నట్లు వివరించారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఉదయం ఎనిమిది గంటల వరకు పెబ్బేరు వీజేపీ గ్రౌండ్‌కు చేరుకోవాలని ఆయన సూచించారు.

మూగ యువతి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడి సస్పెన్షన్

నాగర్‌కర్నూల్ టౌన్, ఏప్రిల్ 19 : మూగ యువతి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడు మాసయ్యను కలెక్టర్ విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాధికారి గోవిందరాజులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాసయ్య సోషల్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఘటనపై విచారణ అనంతరం కలెక్టర్ ఉత్తర్వుల మేరకు సదరు ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేసినట్లు డీఈవో పేర్కొన్నారు.

విద్యుదాఘాతానికి గురై పాడి గేదె మృతి

పెద్దకొత్తపల్లి, ఏప్రిల్ 19 : నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం పెద్దకార్పాముల గ్రామంలో మల్లెల బంగారికి చెందిన పాడి గేదె ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. గేదె విలువ రూ.60 వేలు విలువ ఉంటుందని, మృతితో జీవనోపాధిని కోల్పోయానని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. బాధిత రైతును ఆదుకోవాలని గ్రామ మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.

వ్యక్తి బైండోవర్

హన్వాడ, ఏప్రిల్ 19 : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పాత కేసుల్లో ఉన్న వ్యక్తులను పోలీసులు తహసీల్దార్ ముందు బైండోవర్ చేస్తున్నారు. శుక్రవారం ఓ పాత కేసులో ఉన్న వ్యక్తిని పోలీసులు మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ తహసీల్దార్ ముందు బైండోవర్ చేశారు. తహసీల్దార్ కిష్యానాయక్ ఆ వ్యక్తిని మరోసారి ఎలాంటి గొడవలకు పాల్పడవద్దని, పాల్పడితే లక్ష రూపాయల జరిమానా తప్పదని హెచ్చరించి, మరో వ్యక్తి పూచీపై వదిలేశారు.

బెల్టుషాపులో మద్యం స్వాధీనం

» కేసు నమోదు

అలంపూర్ చౌరస్తా, ఏప్రిల్ 19 : జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలం మెన్నిపాడు గ్రామంలో విక్రయానికి గాను నిల్వ ఉంచిన మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల నేపథ్యంలో చేపడుతున్న తనిఖీల్లో భాగంగా ఎస్సై శ్రీనివాస్‌నాయక్ శుక్రవారం తన సిబ్బందితో కలిసి మెన్నిపాడు గ్రామంలో సోదాలు నిర్వహించారు. గ్రామానికి చెందిన ఈడిగ ప్రతాప్‌గౌడు అనే వ్యక్తి ఇంటి వద్ద సోదాలు జరపగా 14.76 లీటర్ల మద్యం లభించింది. మద్యాన్ని విక్రయించేందుకు నిల్వ ఉంచినట్లు విచారణలో తేలడంతో ప్రతాప్‌గౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ రూ.12,710 ఉంటుందన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలుశిక్ష

కల్వకుర్తి, ఏప్రిల్ 19 : డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఇద్దరికి న్యాయాధికారి కావ్య జైలుశిక్ష, జరిమానా విధించారు. ఎస్సై జి.మాధవరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని తిలక్‌నగర్‌కు చెందిన పరికుప్పల రాజు, రంగారెడ్డి జిల్లా ఆమనగల్లులోని శాంతినగర్‌కు చెందిన తాళ్ల రమణలు మద్యం తాగి వాహనాలు నడపడంతో ఇటీవల చేపట్టిన డ్రెంకన్ డ్రైవ్‌లో పట్టుబడగా వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. శుక్రవారం వారిని కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయాధికారి కావ్య పట్టుబడిన రాజుకు ఐదురోజుల జైలుశిక్ష, రూ.500 జరిమానా, రమణకు రెండురోజుల జైలుశిక్ష, రూ.500ల జరిమానా విధించినట్లు ఎస్సై వివరించారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం, ఆటో సీజ్

కోడేరు, ఏప్రిల్ 19 : అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం, ఆటోను పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్సై కురుమూర్తి తెలి పారు. వనపర్తి జిల్లా గోపా లోపేట నుంచి కొల్లాపూర్ మండలం మాచినేనిపల్లి గ్రామానికి కోడేరు మీదుగా ఆటోలో ఏడు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తుండగా పోలీసులకు అ నుమానం వచ్చి తనిఖీ చే శారు. పీడీఎస్ బియ్యంగా నిర్ధారణ కావడంతో ఆటోను అదుపులోకి తీసుకుని, డ్రైవర్ రాగిరి దేవరాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వేటు తప్పింది.. పోటీ మిగిలింది

» స్థానిక ఎన్నికల్లో వేటుకు గురైన అభ్యర్థులకు మళ్లీ పోటీ చేసే అవకాశం

» ఎన్నికల ఖర్చు వివరాలు తెలుపక మూడేళ్ల నిషేధానికి గురైన అభ్యర్థులు

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఏప్రిల్ 19 : 2019 స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్, వార్డు మెంబర్, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు పోటీ చేసి ఎన్నికల ఖర్చుల వివరాలు తెలుపని చాలామంది ప్రజాప్రతినిధులు ఎన్నికల సంఘం చేత వేటుకు గురయ్యారు. సకాలంలో ఎన్నికల ఖర్చుల వివరాలను తెలుపని వారిని మూడేళ్ల పాటు మళ్లీ ఎన్నికల్లో పోటీ చేయకుండా ఎన్నికల సంఘం నిషేధం విధించింది. కానీ ఈసారి స్థానిక సంస్థల ఎన్నికలు కూడా ఆలస్యం కానుండడంతో ఆ మూడేళ్ల నిషేధ కాలం కూడా ఎన్నికల కంటే ముందే తీరిపోయే అవకాశం ఏర్పడింది. దీంతో అనర్హత వేటుపడ్డ వారందరికీ మళ్లీ ఈసారి ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కలిగింది.

మూడేళ్ల పాటు నిషేధానికి గురైంది వీరే..

తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం 2018 ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాల వెలువడిన 45 రోజుల్లోపు ఎన్నికల్లో చేసిన ఖర్చుల వివరాలను నిర్దేశిత నమూనాలో అభ్యర్థులు స్థానిక ఎంపీడీవోకు వెల్లడించాల్సి ఉంటుంది. లేకపోతే ఎన్నికల సంఘం తీసుకునే చర్యలకు బాధ్యులు కావల్సి ఉంటుంది. వనపర్తి జిల్లాలోని 348 మంది వార్డు మెంబర్లు, మరికొంతమంది ఎంపీటీసీ సభ్యులు, జడ్పీటీసీ సభ్యులు ఎన్నికల ఖర్చు వివరాలను తెలియజేయలేదు. దీంతో పలుమార్లు నోటీసులు జారీ చేసిన కూడా వారు స్పందించలేదు. ఎట్టకేలకు 2020 జూన్‌లో కొంతమంది వార్డు మెంబర్లు, 2021 మార్చి, ఏప్రిల్ నెలల్లో మరికొంతమంది వార్డు మెంబర్లపై ఎన్నికల్లో పోటీ చేయకుండా మూడేళ్ల పాటు నిషేధాన్ని విధిస్తూ ఎలక్షన్ కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. వీరంతా వేటుకు గురైన తేదీ నుంచి మూడేళ్ల పాటు ఎలాంటి ఎన్నికల్లో పోటీ చేయడానికి వీలు ఉండదు.

ఎన్నికల ఆలస్యంతో కలిసొచ్చిన అవకాశం

జిల్లాలో 255గ్రామ పంచాయతీలు ఉండగా 2019 జనవరిలో సర్పంచ్, వార్డు మెంబర్ల స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. అదే ఏడాది మే నెలలో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి ఒకటో తేదీతో సర్పంచ్, వార్డు మెంబర్ల పదవీ కాలం పూర్తయింది. వచ్చే జూన్ నెలలో ఎంపీటీసీ, జడ్పీటీసీల పదవీకాలం కూడా పూర్తి కానుంది. మూడేళ్ల క్రితం వేటుకు గురైన ఎంపీటీసీ, జడ్పీటీసీల నిషేధ కాలం కూడా సుమారు అదే సమయంలో పూర్తి కానుంది. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల వైపు మొగ్గు చూపలేదు. గ్రామ పంచాయతీల పరిపాలన బాధ్యతలను ప్రత్యేక అధికారుల చేతిలో పెట్టింది. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల హడావిడి ఉండడంతో స్థానిక సంస్థల ఎన్నికలను జూన్‌లో పెట్టాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. వచ్చే జూన్ నాటికి వార్డు మెంబర్లే కాక ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు కూడా మూడేళ్ల నిషేధ కాలాన్ని పూర్తి చేసుకోనున్నారు. దీంతో వారందరికీ మరోసారి ఎలాంటి ఆంక్షలు లేకుండా యధావిధిగా స్థానిక సంస్థల బరిలో తలపడే అవకాశం ఉంది.



పెద్దతండా(డి) గ్రామ పంచాయతీ కార్యాలయం

పూలరథంలో ఊరేగిన రాములోరు

» సిర్సనగండ్లలో కొనసాగుతున్న నవమి బ్రహ్మోత్సవాలు

» శనివారం రాత్రి మొదలు కానున్న పెద్దరథం ఊరేగింపు


పూలతేరును లాగుతున్న భక్తులు

చారకొండ, ఏప్రిల్ 19 : నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలం సిర్సనగండ్ల సీతారామచంద్ర స్వామి దేవాలయంలో నవమి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. భక్తుల రాకతో రామాలయం శ్రీరామనామ స్మరణతో మారుమోగింది. ఆలయ చైర్మన్ డేరం రామశర్మ, ఈవో యెన్న శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో పూజారులు గురువారం రాత్రి చిన్నరథాన్ని(పూలరథం) వివిధ రకాల పూలతో అలంకరించి స్వామివారి ఉత్సవ మూర్తులను రథంలో ఉంచారు. ఆలయ చైర్మన్ రథాన్ని లాగి తేరును ప్రారంభించారు. భక్తులు జైశ్రీరామ్ స్మరిస్తూ రథాన్ని ముందుకు లాగారు. శుక్రవారం ఆలయ పూజారులు స్వామివారికి అభిషేకం, అర్చనాదులు, శివదత్తాత్రేయ, పరుశరామ, అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. గుట్ట దిగువనున్న మైసమ్మ ఆలయంలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేసి తమ మొక్కులను తీర్చుకున్నారు. శనివారం రాత్రి మొదలుకొని ఆదివారం తెల్లవారుజాము వరకు (పెద్దరథం) బ్రహ్మోత్సవ కార్యక్రమం ఉంటుందని, భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని చైర్మన్ కోరారు. పెద్దరథం రోజున గుట్టపైకి భక్తులను తీసుకెళ్లడానికి ఆర్టీసీ బస్సులను ఉచితంగా నడుపుతున్నామని ఆలయ చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ మేనేజరు నిరంజన్, అర్చకులు డేరం మురళీధర్‌శర్మ, లక్ష్మణశర్మ, ప్రవీణ్‌శర్మ, అనంతరామశర్మ, గోపికృష్ణశర్మ, వేణు గోపాలశర్మ, రఘుశర్మ, జయప్రకాష్‌శర్మ, భక్తులు పాల్గొన్నారు.

మాదారంలో...

ఊర్కొండ : నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలోని మాదారం గ్రామంలో సీతారామచంద్ర స్వాముల వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం తెల్లవారుజామున రథోత్సవాన్ని నిర్వహించారు. ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఉత్సవమూర్తులను పల్లకీలో అంగరంగ వైభవంగా, మంగళ వాయిద్యాల నడుమ భక్తులు రథాన్ని లాగారు. సాయంత్రం శకటోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

బీటీ త్రీ విత్తనాలు అమ్మితే చర్యలు

» జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకటేష్

» భూత్పూర్‌లోని సీడ్స్ ప్రాసెసింగ్ యూనిట్లలో అధికారుల తనిఖీ

భూత్పూర్/పాలమూరు, ఏప్రిల్ 19 : బీటీ త్రీ విత్తనాలు ప్రాసెసింగ్ చేసినా, అమ్మినా సీడ్ యాక్టు చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని మహబూబ్‌నగర్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బోళ్ల వెంకటేష్ హెచ్చరించారు. శుక్రవారం భూత్పూర్ మండల కేంద్రంలోని వివిధ సీడ్స్ ప్రాసెసింగ్ యూనిట్లల్లో జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన వ్యవసాయ శాఖ ఏడీఏలు, ఏవోలు ఆరు బృందాలుగా ఏర్పడి సోదాలు నిర్వహించారు. మండల కేంద్రంలోని వసంత సీడ్స్, సాయితేజ, మవసాన్, ఆద్య, సుదివ్య, కన్వి అగ్రి జెనెటిక్స్ ప్రాసెసింగ్ యూనిట్లల్లో మొత్తం 36 లాట్‌లను సేకరించి పరీక్షలు నిర్వహించారు. అదేవిధంగా స్టాక్ వివరాలు, రిజిస్టర్ నమోదు ప్రకియను పరిశీలించారు. డీసీ, టీసీల వివరాలను తనిఖీ చేశారు. రైతులు బీటీ త్రీ సాగు చేయొద్దని, అదేవిధంగా ప్రాసెసింగ్ చేయొద్దని, డీలర్లు అమ్మకూడదని వ్యవసాయశాఖ అధికారి హెచ్చరించారు. కాగా, 36 లాట్‌లలో పరీక్షలు నిర్వహించగా ఎటువంటి బీటీ3 పత్తి విత్తన నిల్వలు కనుగొనబడలేదని అధికారి వెంకటేష్ తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీఏలు ఆంజనేయులు, యశ్వంతరావు, సాంకేతిక సహ సంచాలకుడు వినోద్, ఏవోలు, శ్యాంయాదవ్, రాజేందర్‌అగర్వాల్, నరేందర్, సిద్ధార్థ, గోపినాథ్, కృష్ణకిషోర్, రాంపాల్, ప్రశాంత్, రాజేష్‌ఖన్నా, రాజేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మురళీధర్ తదితరులున్నారు.


భూత్పూర్‌లో సీడ్స్ ప్రాసెసింగ్ యూనిట్‌లో హెచ్‌టీ పరీక్షలు నిర్వహిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారులు

ఎండ తీవ్రతతో ఆవుకు అస్వస్థత

» సోషల్ మీడియాలో పోస్టు చేసిన స్థానికులు

» చికిత్స చేసిన వైద్యాధికారులు

గద్వాల టౌన్, ఏప్రిల్ 19 : జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సర్కిల్ సమీపంలో శుక్రవారం దూడతో కలిసి రోడ్లపై తిరుగుతున్న ఆవు ఎండతీవ్రతతో అస్వ స్థతకు గురై అచేతనంగా కూలబడిపోయింది. ఈ విషయాన్ని గమనించిన కొందరు స్థానికులు ఫొటో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. విషయం తెలిసిన పశు పశు వైద్యాధికారులు వెంటనే స్పందించారు. సిబ్బందిని పంపించి ఆవుకు చికిత్స చేయించారు. దాదాపు అరగంట పాటు అచేతనంగా పడి ఉన్న ఆవు, చికిత్స తర్వాత ఐదు నిమిషాల్లోనే లేచి దూడతో కలిసి వెళ్లిపోయింది.


ఆవుకు చికిత్స చేస్తున్న పశువైద్య సిబ్బంది

తుంగభద్రను తోడేస్తున్నారు

» ఇసుక తరలింపులో ఇష్టారాజ్యం

» అనుమతి లేకుండా అక్రమ రవాణా

» చోద్యం చూస్తున్న అధికారులు

అయిజ, ఏప్రిల్ 19 : ఇసుక తరలింపులో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. తుంగభద్ర నదిలోని ఇసుకను కొల్లగొడుతున్నారు. అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తు సొమ్ము చేసుకుంటున్నారు. ఇసుక మాఫియా ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ అటు ప్రయాణికులను, ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. అనుమతి కంటే కూడా అక్రమంగా ఇసుక తరలింపే అధికంగా సాగుతోంది.

ప్రధాన ఇసుక వనరు తుంగభద్ర

జోగుళాంబ గద్వాల జిల్లాలో గద్వాల, అలంపూర్‌తో పాటు, ఉమ్మడి జిల్లాలోని ప్రధాన ప్రాంతాలకు తుంగభద్ర నది ఇసుకే ప్రధాన వనరుగా నిలిచింది. ఇక్కడి నుంచే ఇసుక తరలింపు జరుగుతుంది. అయిజ మండలంలోని సింధనూర్, రాజాపూర్, పులికల్, కేశవరం, వేణిసోంపూర్, రాజోలి మండలంలోని చిన్నధన్వాడ, పెద్దధన్వాడ, పుల్లూరు, గార్లపాడు, ర్యాలంపాడు, అలంపూర్ తుంగభద్ర నది పరివాహక ప్రాంతాల నుంచి తరలింపు జరుగుతోంది. ఇక్కడ కొన్ని ప్రాంతాల్లో అధికారికంగా ఇసుక రీచ్‌లు సైతం ఏర్పాటు చేశారు. ప్రభుత్వానికి నిర్ధేశించిన రుసుం చెల్లించి, అనుమతి తీసుకుని ఇక్కడి నుంచే ఇసుక తరలించాల్సి ఉంది. ఈ ప్రాంతాల నుంచి వందలాది ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలింపు జరుగుతోంది. ఒక్క అయిజ మండలంలోని వేణిసోమ్‌పూర్, కేశవరం ప్రాంతాల నుంచే ప్రతీరోజు వందకు పైగా ట్రాక్టర్లు ఉన్నాయి. వాటి ద్వారా ఇసుక రవాణా జరుగుతోంది. ఒకే అనుమతిని చూపిస్తూ రోజంతా ఇసుక రవాణా సాగిస్తున్నారు.

ఇలా జరగాల్సి ఉంది..

ఇసుక అవసరం ఉన్న వ్యక్తులు ప్రభుత్వం నిర్ధేశించిన మేరకు ఆన్‌లైన్‌లో రుసుం చెల్లించాల్సి ఉంది. ఈ సమాచారాన్ని మైనింగ్ అధికారుల దగ్గర నమోదు చేసుకున్న ట్రాక్టర్ల యజమానులకు మెసేజ్ రూపంలో ట్రాక్టర్ల యజమానుల సెల్‌ఫోన్‌లకు వెళుతుంది. సదరు ట్రాక్టర్ నిర్ధేశించిన ఇసుక రీచ్ వద్దకు వెళ్లి అక్కడ ఉన్న అధికారి దగ్గర తన సెల్‌కు వచ్చిన మెసేజ్‌ను చూపించి కన్‌ఫాం చేసుకున్న తర్వాత నదిలోని ఇసుక రీచ్ వద్దకు వెళ్లి ఇసుకను ట్రాక్టర్‌లో లోడ్ చేసుకుని తరలించాల్సి ఉంది.


అనుమతి లేకుండా ముందస్తుగానే ఇసుక నింపి రోడ్డు పక్కన నిలిపిన ట్రాక్టర్లు

ఇలా జరుగుతోంది..

ఇసుక రీచ్‌ల దగ్గర నిర్ధేశించిన అధికారి సమయపాలన పాటించడం లేదనే ఆరోపణలతో ట్రాక్టర్ల యజమానులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. ఇది అలుసుగా తీసుకున్న ట్రాక్టర్ల యజమానులు, వేకువజామున ఐదు గంటల నుంచి నదిలోకి ట్రాక్టర్లను తీసుకెళ్లి ఇసుకను నింపుకుని రోడ్డు పక్కన వరుసగా నిలబెడుతున్నారు. వందలాది ట్రాక్టర్లు ఇలా రోడ్డుకు ఒక పక్కన నిలబెట్టటం, రోడుకు అడ్డంగా రావటం జరుగుతోంది. మరి కొంతమంది అధికారి అనుమతి లేకుండానే అక్రమ మార్గంలో ఇసుకను అడ్డదారిన తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇసుక ప్రజలు, ప్రయాణికుల కళ్లల్లో పడకుండా వాహనాన్ని(టాప్ ఎండ్ ఏర్పాటు)ను కప్పి ఉంచాల్సి ఉంది. అలా చేయడం లేదు. దీంతో కళ్లల్లో ఇసుక పడుతోంది. పైగా అతివేగం, అజాగ్రత్తగా సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడుపుతూ ప్రమాదాలకు కారణం అవుతున్నారు. ఇలాంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాల్సి ఉంది.

చట్టపరమైన చర్యలు తీసుకుంటాం..



ఇసుక రీచ్‌ల దగ్గర ఉన్న అధికారి అనుమతి తీసుకుని కన్ఫామ్ చేసుకున్న తర్వాత రీచ్‌ల వద్దకు వెళ్లి ట్రాక్టర్లు ఇసుకను లోడ్ చేసుకోవాల్సి ఉంది. అలా కాకుండా చేస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయి. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే వాహనం సీజ్ చేసి ఫైన్ వేయాల్సి ఉంటుంది. అందరూ నిర్ధేశించిన ప్రకారం నడుచుకోవాలి.

- రమణ, జిల్లా మైనింగ్ అధికారి

యువతి గుర్తింపు

» కేసీఆర్ అర్బన్ పార్క్‌లో చనిపోయింది పీజీ విద్యార్థిని లక్ష్మి

» కుటుంబ సభ్యులకు మృతదేహం అప్పగింత

» మరణానికి కారణాలపై కొనసాగుతున్న దర్యాప్తు


లక్ష్మి (ఫైల్)

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 19 : ఉన్నత చదువులు చదివి ఉద్యోగానికి ప్రిపేర్ అవుతున్న విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో చనిపోవడంతో కన్నవారిని తల్లడిల్లేలా చేసింది. రెండ్రోజుల క్రితం అనుమానాస్పదంగా కాల్చుకుని చనిపోయిన యువతిని పోలీసులు గుర్తించారు. యువతి తల్లిదండ్రులు శుక్రవారం మహబూబ్‌నగర్ రూరల్ పోలీసులను ఆశ్రయించి, మృతదేహన్ని గుర్తించి, తమ కూతురేనని నిర్ధారించారు. వికారాబాద్ జిల్లా బషీర్‌బాద్ మండలం పర్వత్‌పల్లికి చెందిన తాండూర్ లక్ష్మి(26) ఎంఎస్సీ, బీఈడీ చదివింది. జిల్లా కేంద్రంలోని న్యూటౌన్‌లో ముగ్గురు స్నేహితురాళ్లతో కలిసి ఉంటూ గ్రూప్స్‌కు ప్రిపేర్ అవుతున్నారు. ఈక్రమంలో ఈనెల 17న ఊరెళుతున్నానని తనతో పాటు రూమ్‌లో ఉంటున్న స్నేహితులకు చెప్పి బయలుదేరింది. అక్కడినుంచి నేరుగా కేసీఆర్ అర్బన్ ఎకో పార్క్‌కు చేరుకుని కాలిపోయిన గాయాలతో అనుమానాస్పద స్థితిలో చనిపోయింది. కూతురుకు ఫోన్ చేసినా అందుబాటులో లేకపోవడం, స్నేహితులను అడిగితే ఊరికే వస్తానని చెప్పి వెళ్లిందని చెప్పడంతో అనుమానం వచ్చి రూరల్ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు యువతి మృతదేహం, నగలు చూపించడంతో తమ అమ్మాయేనని గుర్తించారు. చనిపోయిన చోట ఒక కీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అద్దెకు ఉంటున్న రూమ్‌కు సంబంధించి ముగ్గురు స్నేహితుల వద్ద మూడు తాళం చెవిలు ఉన్నాయి. పోలీసులు తమకు ఘటనా స్థలంలో లభించిన తాళం చెవి వారి రూమ్ తాళానికి పెట్టి చూడగా అది సరిపోలడంతో చనిపోయింది లక్ష్మీనేనని నిర్ధారించుకుని మృతదేహన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. అయితే యువతి మరణానికి గల కారణాలు తెలియరాలేదు. కుటుంబ సభ్యులు మాత్రం అనారోగ్య సమస్యలున్నాయని, అయితే ఎలా చనిపోయిందో దర్యాప్తు చేసి న్యాయం చేయాలని కోరారు. పోలీసులు రెండ్రోజులుగా సీఎం పర్యటన బిజీలో ఉండటంతో కేసు దర్యాప్తులో జాప్యం జరుగుతోంది.

ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య

ధరూర్, ఏప్రిల్ 19 : ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలం ఉప్పేరు గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పుష్పావతి(20) కొద్ది రోజులుగా కడుపునొప్పితో బాధపడుతోంది. దీంతో పాటు కుటుంబంలో కలహాలు మొదలయ్యాయి. ఎన్ని ఆస్పత్రుల్లో చికిత్స తీసుకున్నా రోగం నయం కాలేదు. గురువారం రాత్రి కడుపునొప్పితో బాధపడుతూ ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి శంకరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి

చిన్నంబావి, ఏప్రిల్ 19 : బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి చెందిన సంఘటన వనపర్తి జిల్లా చిన్నంబావి మండలం వీపనగండ్ల గ్రామ రహదారిపై చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వెలగొండ గ్రామానికి చెందిన సాయిలు(45) శుక్రవారం కేతేపల్లి గ్రామంలో ఓ వివాహానికి వెళ్లి తిరిగి బైక్‌పై వస్తుండగా అమ్మాయిపల్లి - వీపనగండ్ల గ్రామ రహదారిపై వాహనం అదుపు తప్పి కింద పడిపోయాడు. తీవ్ర రక్తస్రావంతో ఉన్న వ్యక్తిని చూసి సమీప వ్యవసాయ పొలాల్లో ఉన్న రైతులు గ్రామస్థుల సహాయంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

హత్య కేసులో నేరస్తుడికి యావజ్జీవ కారాగార శిక్ష

» రూ.20 వేల జరిమానా

నారాయణపేట, ఏప్రిల్ 19 : హత్య కేసుల్లో నేరస్తుడికి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు, రూ.25 వేల జరిమానా విధిస్తూ శుక్రవారం నారాయణపేట కోర్టులో జిల్లా ప్రధాన న్యాయాధికారి మహ్మద్ అబ్దుల్‌రఫీ తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళితే నర్వ మండలం పెద్దకడుమూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్(42) హైదరాబాద్‌లో ఆటో నడుపుకుంటూ భార్యాపిల్లలతో కలిసి జీవిస్తున్నాడు. గ్రామంలో తనకున్న పొలాన్ని కొలత చేయించగా పక్క పొలానికి చెందిన బాలరాజు అభ్యంతరం తెలిపాడు. అయితే, శ్రీనివాస్‌కు, బాలరాజుకు మధ్య వ్యవసాయ భూతగాదాలు ఉన్నాయి. వీటిని పరిష్కరించేందుకు గాను పెద్దల సమక్షంలో మాట్లాడుదామని 2022 జూన్ 11వ తేదీన బాలరాజు, శ్రీనివాస్‌ను గ్రామానికి పిలిపించాడు. పెద్దలు తర్వాత మాట్లాడుదామని చెప్పి పంపించారు. అదే నెల 14వ తేదీన రాత్రి గ్రామంలోనే ఉంటున్న తన చెల్లెలు అనిత ఇంటి ముందు మంచంపై కూర్చొని భోజనం చేస్తుండగా వెనుక నుంచి వచ్చిన బాలరాజు రోకలిబండతో శ్రీనివాస్ తలపై రెండుసార్లు కొట్టడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య కాశమ్మ మరుసటి రోజు పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై విక్రమ్ కేసు నమోదు చేశారు. సీఐ రాంలాల్ కేసును పరిశోధించి నేరస్తుడికి వ్యతిరేకంగా 18 మందిని సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి వాదనలను వినిపించారు. నేరం రుజువు కావడంతో బాలరాజుకు యావజ్జీవ శిక్షతో పాటు, రూ.20 వేల జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పునిచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ యోగేష్‌గౌతమ్ మాట్లాడుతూ నేరస్తుడికి శిక్ష పడేలా కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆకుల బాలప్ప, సీఐలు రాంలాల్, రాజేందర్‌రెడ్డి, ఎస్సైలు విక్రమ్, కుర్మయ్య, కోర్టు డ్యూటీ అధికారులు వేణుగోపాల్, విజయ్‌కుమార్, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ బాలకృష్ణయ్యలను అభినందించారు. త్వరలోనే రివార్డులు ఇప్పిస్తామన్నారు.

సికిల్‌సెల్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

» సికిల్‌సెల్ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ ప్రదీప్

» వ్యాధి నిర్ధారణ పరీక్షల విధానంపై వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలకు అవగాహన


మన్ననూరు పీహెచ్‌సీలో వైద్యసిబ్బందికి వ్యాధినిర్ధారణ పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ప్రదీప్

మన్ననూర్, ఏప్రిల్ 19 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జన్‌మన్ సికిల్‌సెల్ వ్యాధి నిర్ధారణ పరీక్షలను గిరిజన గ్రామాల్లో పకడ్బందీగా నిర్వహించాలని సికిల్‌సెల్ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ ప్రదీప్ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూరు పీహెచ్‌సీలో సికిల్‌సెల్ వ్యాధి నిర్ధారణ పరీక్షలను నిర్వహించే విధానంపై వైద్య సిబ్బంది ఆరోగ్య కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికిల్‌సెల్ అనేది రక్తంలో వచ్చే వ్యాధి అని, దీనిని మానవ శరీరంలో గుర్తించి, వ్యాధిగ్రస్తులకు హైడ్రాక్సీ యూరియా అనే మందులను ప్రభుత్వమే ఉచితంగా పంపిణీ చేస్తుందన్నారు. జన్మించిన శిశువు నుంచి మొదలుకొని వందేళ్ల వృద్ధుల వరకు ప్రభుత్వం అబాకార్డులను ఆధార్ కార్డులతో అనుసంధానం చేసి వారందరి హెల్త్ ప్రొఫైల్ రూపొందించబడుతుందన్నారు. ఆధార్ కార్డులను మొబైల్‌తో అనుసంధానం చేయించుకొని అబా కార్డుల్లో పేర్లను నమోదు చేయించుకొనే ప్రక్రియను స్థానిక ఏఎన్ఎం, ఆరోగ్య కార్యకర్తలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పీహెచ్‌సీలకు అందజేసిన సికిల్‌సెల్ కిట్ల ద్వారా ప్రతీ ఒక్కరి నుంచి రక్తనమూనాలను సేకరించి జిల్లా ఆసుపత్రికి పంపించాలన్నారు. అబాకార్డుల్లో పేరున్న ప్రతి ఒక్కరికీ ఆరోగ్యశ్రీతో పాటుగా అదనంగా కేంద్రం నుంచి వచ్చే రూ.ఐదు లక్షల హెల్త్ ఇన్సూరెన్స్ అమలులో ఉంటుందన్నారు. డీఎంహెచ్‌వో కార్యాలయ డాటా మేనేజర్ సందీప్, మన్ననూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుధాకర్, ఆరోగ్య సహాయకుడు లోక్యానాయక్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

కార్యకర్తలు సంఘటితం కావాలి

- ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి



గొరిటలో కార్యకర్తలతో నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి

తిమ్మాజిపేట, ఏప్రిల్ 19 : గ్రామంలో కార్యకర్తలు సంఘటితం కావాలని డాక్టర్ మల్లురవిని నాగర్‌కర్నూల్ ఎంపీగా గెలిపించాలని ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్ రెడ్డి పిలుపునిచ్చారు. తిమ్మాజిపేట మండల పరిధిలోని గొరిట గ్రామంలో తెలంగాణ జన సమితి పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్యాంప్రసాద్‌రెడ్డి నిర్మించిన నూతన గృహ ప్రవేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలతో కాసేపు మాట్లాడారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్‌కు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటుందని, అందరూ కాంగ్రెస్‌ను ఆదరించి మెజారిటీ కోసం కృషి చేయాలన్నారు. ప్రజల మధ్య ఉంటూ సమస్యలపై పోరాటం చేస్తూ పిలిస్తే పలికే డాక్టర్ మల్లు రవిని నాగర్‌కర్నూల్ ఎంపీగా గెలిపించేందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లయ్యగౌడ్, శ్రీనివాస్ బహదూర్, మాధవులు, మల్లేష్‌ముదిరాజ్, భాస్కర్‌గౌడ్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు చేపట్టాలి



గుంతకోడూరులో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న బీసీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు కే కృష్ణుడు

తాడూరు, ఏప్రిల్ 19 : రాష్ట్ర ప్రభుత్వం జీవో 317 పరిష్కరించి ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు చేపట్టాలని బీసీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు కే కృష్ణుడు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తాడూరు మండల పరిధిలోని గుంతకోడూరు గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఆరు సంవత్సరాలుగా బదిలీలు లేక 8సంవత్సరాల నుంచి ప్రమోషన్లు లేక ఎంతో మంది ఉపాధ్యాయులు తమ అమూల్యమైన సర్వీస్‌ను కోల్పోయి పదవీ విరమణ చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉపాధ్యాయులు ఆవేదనను అర్థం చేసుకుని వెంటనే ప్రమోషన్లు చేపట్టాలన్నారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని, 2010 డీఎస్సీ కన్నా ముందు నియమితులైన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీటీఏ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భాస్కర్, వెంకటయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.తిరుపతయ్య, జీహెచ్‌ఎం రాష్ట్ర బీసీ టీడీఎల్‌పీ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్, బీసీటీఏ జిల్లా, మండల బాధ్యులు పాల్గొన్నారు.

బూటకపు హామీలతో కాంగ్రెస్ గద్దెనెక్కింది

- బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్



కొల్లాపూర్‌లో ప్రచారం ప్రారంభించిన బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

కొల్లాపూర్, ఏప్రిల్ 19 : అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలకు బూటకపు హామీలిచ్చి కాంగ్రెస్ పార్టీ గద్దెనెక్కిందని బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. శుక్రవారం సాయంత్రం కొల్లాపూర్ పట్టణంలో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు కొల్లాపూర్ పట్టణంలో ఇంటింటికి తిరుగుతూ ఎంపీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ చేపట్టిన మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి మాట్లాడుతూ నాలుగు నెలల కాంగ్రెస్ పరిపాలనలో ఎక్కడా వేసిన సమస్యలు అక్కడే ఉన్నాయన్నారు. ఎంపీ ఎన్నికల్లో ప్రజలు బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిని ఆదరిస్తే ప్రజల తరఫున ప్రభుత్వాన్ని నిలదీస్తామని, సమస్యల పరిష్కారం కోసం పని చేస్తామని అన్నారు. మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఎంపీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్ గెలుపు కోసం బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు సమిష్టి కృషితో పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కాలికి గాయమైన ఆయన ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్‌తో కలిసి ప్రచారాన్ని ప్రారంభించి ప్రజలను ఓటు అభ్యర్థించారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు రంగినేని అభిలాష్‌రావు, మాజీ జడ్పీటీసీ కాటం జంబులయ్య, మునిసిపల్ కౌన్సిలర్ కృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు రాంచందర్‌యాదవ్, కలమూరి నిరంజన్, కోతుల వెంకటేశ్వర్లు, డీకే.మాదిగ పాల్గొన్నారు.

దళితవాడకు విద్యుత్ సౌకర్యం కల్పించాలి

- తెలంగాణ మాదిగ దండోరా జిల్లా అధ్యక్షుడు డీకే మాదిగ

- ట్రాన్స్‌కో ఏఈ రాకేష్‌కు వినతి



కొల్లాపూర్‌లో ట్రాన్స్‌కో ఏఈ రాకేష్‌కు వినతి పత్రం అందజేస్తున్న డీకే మాదిగ

కొల్లాపూర్, ఏప్రిల్ 19 : కొల్లాపూర్ మండల పరిధిలోని నార్లాపూర్ గ్రామంలో దళిత కాలనీలో మాదిగల శ్మశాన వాటిక వద్ద రెండు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి దాదాపు మూడేళ్లవుతున్నా విద్యుత్ తీగలు ఏర్పాటు చేయలేదని పేర్కొంటూ మాదిగ దండోరా జిల్లా అధ్యక్షుడు డీకే.మాదిగ శుక్రవారం ట్రాన్స్‌కో ఏఈ రాకేష్‌కు వినతి పత్రం అందజేశారు. ఎంపీ ఎన్నికల కోడ్‌లో విద్యుత్ స్తంభాల ఏర్పాటు, వైర్లు లాగడం వీలు కాదని, సమస్య తమ దృష్టిలో ఉందని, కోడ్ అయిపోయిన వెంటనే విద్యుత్ స్తంభాలకు కరెంటు తీగలు లాగి సరఫరా చేస్తామని ఏఈ చెప్పినట్లు పేర్కొన్నారు.

శాంతిభద్రతల పట్ల అప్రమత్తంగా ఉండాలి

వెల్దండ, ఏప్రిల్ 19 : గ్రామాలలో శాంతిభద్రతలపట్ల పోలీసులు అప్రమత్తంగా ఉండాలని కల్వకుర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లు సూచించారు. శుక్రవారం వెల్దండ పోలీస్‌స్టేషన్‌ను వెంకటేశ్వర్లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దొంగతనాలపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో కొత్తవ్యక్తులు కనిపిస్తే పోలీసులకు ప్రజలు సమాచారం అందించాలని సూచించారు. రాబోవు పార్లమెంటు ఎన్నికల్లో సమస్యాత్మక గ్రామాలలో ఎటువంటి గొడవలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. నేరాల నియంత్రణలో ప్రజల పాత్ర ఎంతో కీలకమని ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్‌ఐ రవిలు ఉన్నారు.

ముక్కిడిగుండంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి ఎన్నికల ప్రచారం

కొల్లాపూర్, ఏప్రిల్ 19 : కొల్లాపూర్ మండల పరిధిలోని ముక్కిడిగుండం గ్రామంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు ఆదేశాలతో బీజేపీ ఎంపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్ విజయం కోరుతూ ఆ పార్టీ శ్రేణులు గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్టీ మోర్చా ప్రధాన కార్యదర్శి కొడావత్ భీముడునాయక్ మాట్లాడారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి శేఖర్, ముక్కిడిగుండం బీజేపీ నాయకులు పెద్దాపురం పరమేశ్, ఎండి.జిలానీ, నవీన్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ఇవీ రోడ్లేనా..?

- **బీటీకి నోచుకోని గ్రామీణ రాహదారులు**
- **కంకర తేలి గుంతలమయంగా మారిన రోడ్లు**
- **వాహనదారులు, ప్రజలకు నరకయాతన**
- **పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు**



చారకొండలో గుంతల మయంగా మారిన కోదాడ- జడ్చర్ల జాతీయ రహదారి

చారకొండ, ఏప్రిల్ 19: గ్రామీణ రోడ్లకు ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలోని ఆయా గ్రామాలకు వెళ్లే మట్టి రోడ్లు ఏళ్ల కిందట వేయడంతో రోడ్లు గుంతలుగా ఏర్పడి కంకర తేలి ఉండడంతో ప్రయాణం చేయడం ఇబ్బందిగా మారింది. ఏళ్లు గడుస్తున్నా బీటీ రోడ్లు వేయడం లేదు. కనీసం మట్టి చదును కూడా చేయడం లేదు. రోడ్లపై ప్రయాణం చేయాలంటే ప్రయాణికులు, ప్రజలకు నరకప్రాయంగా తయారైంది. నూతనంగా మండల కేంద్రంగా ఏర్పడిన చారకొండకు ఆయా గ్రామాల నుంచి వివిధ పనులకోసం ప్రజలు, రైతులు, వాహనదారులు నిత్యం వస్తుంటారు. కంకర తేలి గుంతల మయంగా మారిన రోడ్లపై ప్రయాణించాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని రావాల్సి వస్తుందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

● గుంతల మయంగా జడ్చర్ల - కోదాడ జాతీయ రాహదారి

కోదాడ - జడ్చర్ల జాతీయ రాహదారి నిర్మాణంలో భాగంగా చారకొండ మండల కేంద్రంనుంచి మండలంలోని మర్రిపల్లి వరకు బైపాస్ రోడ్డు నిర్మాణం పనులను చేపడుతున్నారు. మండల కేంద్రంనుంచి మర్రిపల్లి వరకు రెండు కిలోమీటర్ల వరకు జాతీయ రాహదారి పూర్తిగా గుంతల మయంగా ఏర్పడింది. జాతీయ రహదారిపై నిత్యం వందలాది వాహనాల రాకపోకలు జరుగుతుంటాయి. దీంతో మండల కేంద్రంలో రహదారిపై గుంతలు ఏర్పడటంతో వాహనాల రద్దీతో దుమ్ము లేవడంతో ప్రయాణికులు, ప్రజలు, దుకాణం దారులు ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడి ఆసుపత్రుల పాలైన సంఘటనలు చాలా ఉన్నాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి చారకొండ నుంచి మర్రిపల్లి వరకు ప్రస్తుతం ఉన్న రోడ్డునే నాలుగులైన్ల రోడ్డుగా మార్చి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

● కంకర పరిచి... తారు మరిచారు



కంకర పరిచి తారు వేయకుండా వదిలేసిన జూపల్లి-నెమలిగుట్ట తండా రహదారి

చారకొండ మండలం జేపల్లి పంచాయతీలోని నెమలిగుట్టతండా నుంచి కోదాడ-జడ్చర్ల జాతీయ రాహదారిపై గల జూపల్లి వరకు మూడు కిలోమీటర్ల వరకు తారు రాహదారి నిర్మాణానికి 2022-23 సంవత్సరంలో సమగ్ర గిరిజన అభివృద్ధి పథకం (ఎస్టీ ఎస్‌డీఎఫ్) ద్వారా గత ప్రభుత్వం రూ. 2 కోట్ల 70 లక్షలు మంజూరు చేసింది. పనులు దక్కించుకొన్న గుత్తేదారు రహదారిపై కంకర పరిసి తారు వేయకుండా వదిలి వేయడంతో రాకపోకలకు వాహనదారులకు, ప్రజలకు ఇబ్బందిగా మారింది. వాహనదారులు వెళ్తున్నప్పుడు కంకర రాళ్ల ఎగిరిపడి ప్రమాదాలకు గురవుతున్నారు.

● బీటీ రోడ్లకు నోచుకోని గ్రామాలు

చారకొండ మండల కేంద్రం నుంచి రాంపూరం- చంద్రాయణపల్లి- గోకారం, గోకారం నుంచి గోకారం గేట్ కోదాడ-జడ్చర్ల జాతీయ రాహదారి వరకు బీటీ లేదు. అలాగే, జూపల్లి నుంచి - వంగూరు గేట్ హైదరాబాద్ శ్రీశైలం ప్రధాన రహదారి వరకు అదే పరిస్థితి. సారంబండతండా నుంచి దొంతలగుట్టతండా వరకు, బొమ్మలగుడిసెలు- కమాల్‌పూర్‌తండా నుంచి కమాల్‌పూర్‌తండా గేట్ జాతీయ రహదారి వరకు కూడా బీటీ లేదు.

సిర్సనగండ్ల నుంచి రామచంద్రాపురం వరకు వెళ్లే రోడ్లు మరమ్మతులకు కూడా నోచుకోవడం లేదు. కనీసం మట్టి వేసి చదును చేయడం లేదు. ప్రభుత్వం స్పందించి ప్రత్యేక నిధులు కేటాయించి బీటీ రోడ్లుగా మార్చాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

● బీటీ రోడ్డు మంజూరైంది

చారకొండ మండల కేంద్రం నుంచి రాంపూరం వరకు బీటీ రోడ్డు మంజూరైంది. రూ. 3 కోట్ల 60 లక్షలు మంజూరయ్యాయి. టెండర్ల పనులు కూడా పూర్తయ్యాయి. బీటీ రోడ్డు పనుల నిర్మాణం చేపట్టాలని పై అధికారులకు నివేదికలు పంపించాం. అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

- మౌనిక, పీఆర్‌ఏఈ చారకొండ

● వారం రోజుల్లో పనులు ప్రారంభిస్తాం

చారకొండ మండలంలోని నెమలిగుట్టతండా నుంచి జూపల్లి వరకు 3 కిలోమీటర్ల మేర గుత్తెదారులు కంకర వేశారు. తారు రోడ్డు నిర్మాణం పనుల్లో కొంత ఆలస్యం జరిగిన మాటా వాస్తవమే వారం రోజుల్లో పనులు ప్రారంభించి తారు రోడ్డు నిర్మాణం పనులను పూర్తి చేస్తాం.

- డిప్యూటీ ఈఈ వెంకటేశ్వరసింగ్

● మండల కేంద్రానికి రావడానికి ఇబ్బంది

మా గ్రామం నుంచి మండల కేంద్రమైన చారకొండకు రావడానికి రోడ్డు సౌకర్యం సక్రమంగా లేదు. వర్షకాలం వస్తే కంకర తేలి గుంతలమయంగా మారిన రోడ్డులో వర్షపు నీళ్లు నిలుస్తాయి. వాహనదారులకు, ప్రజలకు చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గుంతల మయంగా మారిన రోడ్డును బీటీ రోడ్డుగా మార్చి మండల కేంద్రానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి.



- జమ్ముల పుష్మాల్, చంద్రాయణపల్లి

● గ్రామాలకు బీటీరోడ్లు వేయాలి

ప్రజల సౌకర్యం కోసం గ్రామగ్రామాలకు బీటి రోడ్లను నిర్మిస్తే అభివృద్ధి చెందుతాయి. నూతనంగా ఏర్పడిన మండల కేంద్రానికి ఆయా గ్రామాల ప్రజలు నిత్యం మండల కేంద్రానికి వస్తుంటారు. గ్రామాల నుంచి మండల కేంద్రానికి రోడ్లు సక్రమంగా లేకపోవడంతో క్రయవిక్రయాలకు పట్టణాలకు వెళ్తున్నారు. గ్రామాల నుంచి మండల కేంద్రానికి బీటీ రోడ్లను నిర్మిస్తే చారకొండకు వస్తారు.



- సిరందాసు శ్రీనివాసులు, చారకొండ

అధికారులు సమన్వయంతో పని చేయాలి

- ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

లింగాల, ఏప్రిల్ 19: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లింగమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశం సాదాసీదాగా కొనసాగింది. సమావేశంలో పలు అంశాలపై ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో సమాచారం తెలుసుకున్నారు. వేసవి కాలం కావడంతో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ హేమలతను ఆదేశించారు. గ్రామాల్లో సర్పంచుల పాలన లేనందున పంచాయతీల ప్రత్యేకాధికారులు తక్షణమే స్పందించాలని సూచించారు. సమావేశంలో పాల్గొన్న పలువురు సభ్యులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీల స్కీంలలో 5 స్కీంలను అమలు చేస్తుందని, పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన తర్వాత స్కీంలు పూర్తిస్థాయిలో అమలు చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే అన్నారు. వైస్ ఎంపీపీ నారాయణ గౌడు, ఎంపీడీవో ఆంజనేయులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమష్టిగా పని చేయాలని

పార్టీ పటిష్ఠతకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పని చేయాలని ఎమ్మెల్యే సూచించారు. శుక్రవారం లింగాలలో పార్టీ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థి డాక్టర్ మల్లురవి విజయానికి కృషి చేయాలని ఆయన కార్యకర్తలను కోరారు. కష్టపడి పని చేసేవారిని పార్టీ గుర్తిస్తుందని అన్నారు.

హామీలు నెరవేర్చని ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి

- మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



విలేకరులతో మాట్లాడుతున్న జైపాల్‌యాదవ్

వెల్దండ, ఏప్రిల్ 19 : ఇచ్చిన హామీలను నెరవేర్చని కాంగ్రెస్ పార్టీకి పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పాలని మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్‌యాదవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆమనగల్లులోని శ్రీలక్ష్మి గార్డెన్‌లో శనివారం పార్టీ నియోజకవర్గస్థాయి విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. సమావేశానికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. అన్ని మండలాల నుంచి పెద్దఎత్తున పార్టీశ్రేణులు హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. నాగర్‌కర్నూల్ నుంచి ఉన్నత విద్యావంతుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించేందుకు ప్రతీ కార్యకర్త సైనికుడిలా కృషిచేయాలని జైపాల్‌యాదవ్ కోరారు. కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, నాయకులు వెంకటయ్యగౌడ్, విజయ్‌గౌడ్, శేఖర్, నిరంజన్, మధుసూదన్‌రెడ్డి, అర్జున్‌రావు, శ్రీనివాస్‌యాదవ్, పత్యానాయక్, దశరథ్‌నాయక్, బీమయ్యగౌడ్, ఎంగలి రఘు, ఆనందు, ఎల్ఎన్‌రెడ్డి ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

చెర్కూర్ గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ నర్సింహ తండ్రి పురుగుల లింగయ్య ఆకస్మికంగా మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌లు మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. లింగయ్య భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు బీమయ్యగౌడ్, మైసయ్య, కొండల్, లాలయ్య, సైదులు, సతీష్, సుమన్‌నాయక్ ఉన్నారు.

బెల్టుషాపులు, సారా నిషేధించాలి

కోడేరు, ఏప్రిల్ 19 : మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో బెల్టుషాపులను, సారాను నిషేధించాలని డీవైఎఫ్ఐ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కార్యాలయంలో మద్యం, సారా, బెల్టుషాపులను ఎత్తివేయాలని డిప్యూటీ తహసీల్దార్ విజయలక్ష్మికి డీవైఎఫ్ఐ నాయకులు వినతి పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ మండల నాయకుడు శివశంకర్ మాట్లాడుతూ మద్యం, నాటుసారా, బెల్టుషాపులు గ్రామాల్లో విచ్చలవిడిగా గల్లీగల్లీలో ఉన్నాయని వాటి ద్వారా ప్రజలు కొందరు మద్యానికి బానిసలై జేబులు గుల్లా చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబాలు ఆర్థికంగా దెబ్బతినడంతోపాటు ప్రాణాలను పోగొట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మద్యం, సారా, బెల్టుషాపులను ఎత్తివేయాలని అన్నారు. డీవైఎఫ్ఐ మండల నాయకులు శ్రీశైలం, బద్దుల రాము, మిద్దె కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఉదయం 10గంటలలోగా పనులు ముగించాలి

మన్ననూర్, ఏప్రిల్ 19: వేసవిలో ఎండలు మండుతున్నాయని, అధిక ఉష్ణోగ్రతల నమోదును దృష్టిలో ఉంచుకొని ఉపాధి హామీ కూలీలు ప్రతి రోజు ఉదయం ఏడు గంటలకు పనులు మొదలు పెట్టి ఉదయం 10లోగా పనులు ముగించుకోవాలని డీఆర్‌డీవో చిన్నబులేష్ అన్నారు. అమ్రాబాద్ మండలం మన్ననూరు, వెంకటేశ్వర్లబావి గ్రామాల్లోని నర్సరీలను పరిశీలించారు.

అనంతరం ఉపాధి పనులు జరుగుతున్న ప్రాంతాలకు వెళ్లిన ఆయన క్షేత్ర స్థాయి పనులను పరిశీలించారు. కూలీలకు చెల్లిస్తున్న కూలీ ధర, హాజరు నమోదు వంటి అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూలీలు ఎండలు ముదరకముందే ఉదయాన్నే పనులను పూర్తి చేసి ఇళ్లకు వెళ్లాలన్నారు.

కూలీలందరూ మే 13న జరిగే పార్లమెంటు ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, పట్టణ ప్రాంతాల్లో కూలీ కోసం వెళ్లిన వారు, ఇతర ప్రాంతాల్లో ఉండే తమ బంధువులందరినీ గ్రామాలకు పిలిపించి ఓటు వేసేలా ప్రోత్సహించాలని కోరారు. అమ్రాబాద్ ఎంపీడీవో మోహన్‌లాల్, ఉపాధి హామీ ఏపీవో రఘు, ఈసీ రేణయ్య, సాంకేతిక సహాయకుడు వెంకటేశ్వర్లు, క్షేత్ర సహాయకుడు కృష్ణ నాయక్ పాల్గొన్నారు.

రామాలయ కమిటీ ఆధ్వర్యంలో దాతలకు సన్మానం

మన్ననూర్, ఏప్రిల్ 19: అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామంలోని అంబేడ్కర్ కాలనీలోని రామాలయానికి పంచలోహ ఉత్సవ విగ్రహాలను అందజేసిన వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు సంబు వెంకట్‌రమణను, ప్రతియేటా శ్రీరామనవమి రోజు కల్యాణోత్సవానికి పట్టువస్త్రాలు, తలంబ్రాలను ఇస్తున్న ఆర్యవైశ్య మహాసభ రీజినల్ చైర్మన్ జూలూరి సత్యనారాయణను శుక్రవారం రామాలయ కమిటీ అధ్యక్షుడు రఘునా ఆధ్వర్యంలో సన్మానించారు. ఆలయ కమిటీ నాయకులు పంబలి బుచ్చయ్య, వెంకటేశ్వర్లు, గిరిబాబు , రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

జనయాత్రకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు

ఊర్కొండ, ఏప్రిల్ 19: మహబూబ్ నగర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీ చంద్ రెడ్డి నామినేషన్ దరఖాస్తు సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి హాజరైన జనయాత్రకు మండలం నుంచి కాంగ్రెస్ శ్రేణులు శుక్రవారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో జెండా ఊపి వాహనాలు ర్యాలీగా తరలివెళ్లాయి. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ద్యావ నిఖిల్ రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి రమేష్ నాయక్, మైనారిటీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సమి, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కంఠం విజయుడు, బ్లాక్ కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షుడు గోపాల్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు గోపినాయక్, నాయకులు అయూబ్ పాషా, మనోహర్ రెడ్డి, దుబ్బ మల్లేష్, పోలె శంకర్, మహ్మద్ ఖాజా తదితరులు ఉన్నారు.

22 నుంచి ఆలయ పునర్నిర్మాణ పనులు



వేంకటేశ్వరస్వామి మూల విరాట్

తెలకపల్లి, ఏప్రిల్ 19 : మండల పరిధిలోని పెద్దపల్లిలో బుగ్గ వేంకటేశ్వర స్వామి ఆలయం పునర్నిర్మాణ కార్యక్రమాలు ఈ నెల 22న ప్రారంభం కానున్నాయని దేవాలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీ పోతుగంటి రాములు, ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి, మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డిలు రానున్నారని వారు తెలిపారు. సోమవారం ఉదయం 7:58గంటలకు ప్రారంభమవుతుందని, కావున భక్తులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని దేవాలయ కమిటీ సభ్యులు కోరారు.

మురికి కూపాలుగా డ్రైనేజీలు

- డ్రైనేజీ వాసనకు రోగాలు వస్తున్నాయంటున్న ప్రజలు



తెలకపల్లి బస్టాండ్ ఎదురుగా పేరుకుపోయిన మురికికూపం

తెలకపల్లి, ఏప్రిల్ 19: మండల కేంద్రంలో డ్రైనేజీలు కొన్ని ప్రాంతాల్లో లేకపోవడం వలన మురుగు కూపాలను తలపిస్తున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో డ్రైనేజీలు వేసినా పర్యవేక్షణ లోపం వలన తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఈ విషయంపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. గతంలో ఉన్న ప్రజాప్రతినిధులు కూడా డ్రైనేజీ పట్ల నిర్లక్ష్యంగా ఉండడం వలన ప్రస్తుతం అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. బస్టాండ్‌కు ఎదురుగా ఉన్న వీధుల్లో డ్రైనేజీ ఏర్పాట్లు లేక నీళ్లు మడుగులాగా పారుతుండడంతో తీవ్ర దుర్వాసన వస్తోంది. అంతేకాకుండా అందులో పందులు, కుక్కలు, పశువులు పడి దొర్లుతున్నాయి. ఇదే క్రమంలో దోమల బెడద తీవ్రమై మహిళలు ఇంటి ముందు కూర్చోలేని పరిస్థితి ఏర్పడింది. దుర్వాసన తట్టుకోలేక తలుపులు బిగించుకుని ఇంట్లో కూర్చొంటున్నామని మహిళలు వాపోతున్నారు. మండల కేంద్రంలోని డ్రైనేజీల వాటర్ చాలా మటుకు అచ్చంపేట రోడ్డు వైపు వెళ్తూ ఉంటుంది. అక్కడ సిద్దార్థ మోడల్ స్కూల్, కేకేరెడ్డి స్కూల్ మధ్యలో డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేశారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ చేయకపోవడం వల్ల నీళ్లు ఇంకే అవకాశం లేకుండా సీసీ డ్రైనేజీ వేయడం జరిగింది, దాంతో మురికి ఇంకిపోకపోవడంతో తీవ్ర దుర్వాసనతోపాటు దోమల బెడద కూడా విపరీతంగా ఉంది. వేలాది మంది విద్యార్థులు ఆ పరిసర ప్రాంతాల్లో ఉన్న పాఠశాలల్లో చదువుతూ ఉంటారు. వారికి ఇబ్బంది కలుగుతుంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని వెంటనే తగిన ఏర్పాట్లు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

● త్వరలోనే మురుగునీటి కాల్వ ఏర్పాటు చేస్తాం

మురికి నీరు నిల్వ కాకుండా చూస్తాం. కొందరు వ్యక్తులు ఊరికి వాటర్ పోకుండా చేయడం వలన నీరు నిల్వ ఏర్పడింది. త్వరలోనే పైపులైన్ ఏర్పాటు చేసి నీరు నిల్వ లేకుండా చేస్తాం.

- భాస్కర్, ఈవో

రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలి

తిమ్మాజిపేట, ఏప్రిల్ 19 : రైతులకు ఎరువులు, అమ్మకాలకు సంబంధించిన రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి కమల్‌కుమార్ సూచించారు. మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో రైతు సేవా కేంద్రంలో ఎరువుల గోదామును శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను, ఈపాస్ మిషన్‌ను పరిశీలించి ఇఫ్కో ఈ బజార్ అధికారికి పలు సూచనలు, సలహాలు చేశారు. గోదాములు నిల్వ ఉన్న ఎరువులు వివరాలతోపాటు రైతు పంపిన ఎరువుల వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. రైతుకు ఎరువులు అమ్మితే రసీదు ఇవ్వడం తప్పనిసరి అన్నారు. ఈ పాస్ మిషన్ ద్వారా అన్ని ఎరువుల అమ్మకాలు జరగాలని సూచించారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన కలిగి ఉండాలి

కల్వకుర్తి, ఏప్రిల్ 19 : ఓటు హక్కు వినియోగంపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని కల్వకుర్తి తహసీల్దార్ ఇబ్రహీం కోరారు. కల్వకుర్తి పట్టణంలో శుక్రవారం తహసీల్దార్ ఇబ్రహీం ఆధ్వర్యంలో దివ్యాంగులకు, సీనియర్ సిటిజన్స్‌కు, అంగన్‌వాడీ టీచర్లకు, మహిళా సంఘం సభ్యులకు, కాలనీల్లో యువజన సంఘాలకు, నూతన ఓటర్లకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పట్టణంలో అవగాహన ర్యాలీ సాగింది. అనంతరం తహసీల్దార్ ఇబ్రహీం మాట్లాడుతూ ఓటర్లు తమ ఓటు హక్కును జన్మహక్కుగా భావించాలని కోరారు. ఓటర్లకు ఓటు హక్కు వినియోగంపై పూర్తిస్థాయిలో మోడల్ వీవీప్యాట్ల ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. డీటీ కవిత, అంగన్‌వాడీ టీచర్లు, పలువురు నాయకులు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు ఉన్నారు.

● పెద్దకొత్తపల్లి: ప్రతీ ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని ఏపీవో మంజుల అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చంద్రకల్ గ్రామంలో ఉపాధి హామీ పథకం కూలీలకు ఓటు హక్కుపై ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఫీల్డ్ అసిస్టెంట్ కుర్మయ్య, కూలీలు పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు

వెల్దండ, ఏప్రిల్ 19 : మండలంలోని పోతేపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని సిలోనిబావితండాలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకు చెందిన పలువురు శుక్రవారం బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి యెన్నం శేఖర్‌రెడ్డి సమక్షంలో ఆ పార్టీలో చేరారు. మండల అధ్యక్షుడు కుర్మిద్ద యాదగిరి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసాచారి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు జంగయ్యయాదవ్, నాయకులు రమేష్, మేమ్లు, పెద్దయ్య, మహేష్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

కల్వకుర్తి, ఏప్రిల్ 19 : కల్వకుర్తి పట్టణంలోని బాలరామ్‌నగర్‌కాలనీకి చెందిన తిరుపతిరెడ్డికి మిత్ర ఫౌండేషన్ సభ్యులు శుక్రవారం ఆర్థిక సహాయం అందజేశారు. ప్రైవేట్ టీచర్‌గా పని చేసిన తిరుపతిరెడ్డి ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దారని అతని ఆరోగ్యం బాగా లేకపోవడంతో మిత్ర ఫౌండేషన్ నుంచి ఆర్థిక సహాయం అందజేయడం జరిగిందని సభ్యులు తెలిపారు. ఆర్థిక సహాయం అందజేసిన వారిలో మిత్ర ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి

కల్వకుర్తి, ఏప్రిల్ 19 : గ్రామాలల్లో మురుగునీరు రోడ్లపై పారకుండా ఉండాలంటే ఇంకుడు గుంతలతోనే సాధ్యమని, ప్రతీ ఒక్కరు వాటిని నిర్మించుకునేలా చూడాలని కల్వకుర్తి ఎంపీడీవో ఎస్.వెంకట్రాములు కోరారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే రోగాలు దరిచేరవని ఆయన పేర్కొన్నారు. కల్వకుర్తి మండలం ముకురాల గ్రామంలో శుక్రవారం ఎంపీడీవో గ్రామపంచాయతీలోని రికార్డులను, ప్రభుత్వ పాఠశాలను, అంగన్‌వాడీ, నర్సరీని పరిశీలించారు.

పిడుగుపాటుతో రేకులకు పగుళ్లు

వెల్దండ, ఏప్రిల్ 19 : మండల పరిధిలోని నారాయణపూర్ గ్రామంలో శుక్రవారం సాయంత్రం చిన్నపాటి వర్షానికి సిరమోని జంగయ్య అనే వ్యక్తి ఇంటిముందు పిడుగు పడింది. ఇంటి రేకులు ధ్వంసమయ్యాయి. దుస్తులు కాలిపోయాయి. జంగయ్య ఇంటిముందు ఉన్న వేపచెట్టుపై పిడుగుపడడంతో చెట్టు కొమ్మలు రేకులపై పడి ధ్వంసమయ్యాయి. అంతేగాక ఇంట్లో ఉన్న దుస్తులు కొన్ని కాలిపోయాయి. పిడుగుపాటుకు ఇంటికి సమీపంలో మరో ఇంటిలో ఉన్న రేణుక, జంగయ్య అనే వ్యక్తులు శబ్దానికి ఉలిక్కిపడ్డారు. కాగా జంగయ్య ఇంటి వద్ద లేకపోవడంతో పెనుప్రమాదం తప్పినట్లయింది.

నల్లమలలో ఓ మోస్తరు వర్షం

మన్ననూర్, ఏప్రిల్ 19: నల్లమల అభయారణ్య ప్రాంతంలోని మన్ననూరు, ప్రశాంత్‌నగర్, పర్హాబాద్, మల్లాపూర్ పెంట, గుండం బేస్‌క్యాంపు, దారావాగు బేస్ క్యాంపు తదితర ప్రాంతాల్లో శుక్రవారం మధ్యాహ్నం ఓ మోస్తరు వర్షం కురిసింది.

అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతూ ఉండడంతో శుక్రవారం కురిసిన వర్షం కారణంగా చల్లటి గాలులు వీచాయి.